# పాలస్తీనా ప్రజానీకం వారి పోరాటంలో ఒంటరిగా లేరు




**2020** ఆగస్టు 13న అమెరికా–శ్వేత భవనంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఏఇ) మరియు ఇజ్రాయిల్ దేశాలు ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఇజ్రాయిల్‌తో పూర్తిస్థాయి దౌత్య సంబంధాలు ఏర్పరచుకోవాలని, దీనికి ప్రతిగా వెస్ట్‌బ్యాంక్‌లోని పాలస్తీనా భూభాగాలను విస్తరించే పథకాలను ఇజ్రాయిల్ తాత్కాలికంగా నిలిపివేయాలని ఈ ఒప్పందం పిలుపునిచ్చింది.

మాతృభూమికొరకు పాలస్తీనా ప్రజానీకం దీర్ఘకాలంగా సాగించే పోరాటాన్ని తక్కువ చేసి చూపటానికి, పాలస్తీనా సమస్యకు హేతుబద్ధ, శాంతియుత పరిష్కారమార్గం కోసం సాగే కృషిలో నూతన అవరోధాలను కల్పించటానికి అమెరికా చేసిన కుట్రపూరిత ఆలోచనల ఫలితమే ఈ ఒప్పందం అనే దాంట్లో సందేహంలేదు.

అరబ్ ప్రపంచంలో పాలస్తీనా ప్రజల మద్దతు స్థావరాల్ని దురాక్రమించే, విభజించే, నాశనం గావించే అమెరికా వ్యూహాత్మక పథకాల ఫలితం కూడా ఈ ఒప్పందం. అలాగే ఇజ్రాయిల్ యూదు దురహంకార పాలకుల దాడి కోరలకు పదునుబెట్టి దాని ఆధిపత్యాన్ని పాలస్తీనాపై రుద్దేందుకు ఒక సాధనంగా ఉపయోగించటంలో భాగమే ఈ ఒప్పందం! మధ్య ప్రాచ్యంలో విస్తారంగా ఇజ్రాయిల్ దోపిడీ సాగించేందుకు, దాని కోరలను ముందుకు సాచేందుకు ఈ ఒప్పందం మార్గం చూపుతోంది. "యుఏఇలో అన్నిరకాల ఇజ్రాయిల్ సరుకులను, ఉత్పత్తులను పొందటానికి, ప్రవేశానికి, మార్పిడికి అనుమతినీయటం జరుగుతుంది" అని ఒప్పందంపై సంతకాల అనంతరం యుఏఇ ప్రభుత్వం విడుదల చేసిన ఒక పత్రంలో పేర్కొంది. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహు ఈ ఒప్పందాన్ని ఆహ్వానిస్తూ, మధ్యప్రాచ్యపు అత్యంత పురోగామి ఆర్థికవ్యవస్థల మధ్యన హద్దులేని వాణిజ్యానికి, పర్యాటకానికి, పెట్టుబడులకు, మార్పిడులకు ఇజ్రాయిల్ ద్వారాలు తెరుస్తోంద'ని పేర్కొన్నాడు. ఇరుదేశాల ప్రతినిధి బృందాలు త్వరలో కలుసుకొని పెట్టుబడులు, పర్యాటకం, నేరుగా విమానాల రాకపోకలు, భద్రత, టెలికమ్యూనికేషన్స్, సాంకేతికత, ఇంధనం, ఆరోగ్య రక్షణ, సంస్కృతి, పర్యావరణం, ఇరుదేశాలలో దౌత్యకార్యాలయాల స్థాపన, మరియు ఇరుదేశాలకూ పరస్పర యోగ్యమైన ఇతర అంశాల గురించిన ద్వైపాక్షిక ఒప్పందాలపై సంతకాలు చేస్తాయని కూడా పేర్కొన్నాడు. 'ఈ ఒప్పందం ఎంత గొప్ప ఫలితాలనిస్తుందో మీరు చూస్తారు' అంటూ 'ఈనాటి సంచలనం మరునాటికి విధానాలుగా పరిణమిస్తుందని, ఇజ్రాయిల్‌తో తమ సంబంధాలను సాధారణ స్థితికి తెచ్చుకునేందుకు ఇతర దేశాలకు ఈ ఒప్పందం మార్గం చూపుతుందని' ఆశాభావం వ్యక్తం చేశాడు.

యుఏఇ, ఇజ్రాయిల్‌ల ఒప్పందం 'పాలస్తీనీయుల భూముల ఆక్రమణకు ఇజ్రాయిల్ రూపొందించుకున్న పథకాలను తాత్కాలికంగా నిలిపివేస్తుందని' మాత్రమే పేర్కొంది. అయితే, జోర్డాన్ లోయను, వెస్ట్‌బ్యాంక్‌లోని ఇజ్రాయిల్ ఆక్రమిత పాలస్తీనా భూములలో యూదుల జనావాసాలను కలిపి వేసుకునే తన పథకాన్ని ఇజ్రాయిల్ రద్దుచేసుకోవటం లేదంటూ నొక్కి చెప్పటానికి నెతన్యాహు ఉత్సాహం ప్రదర్శించాడు. పాలస్తీనీయుల భూములను కలిపివేసుకోవటాన్ని వాయిదా వేయటంకోసం తప్ప రద్దుచేయటానికి తను అంగీకారం తెలపలేదని వివరణ ఇచ్చాడు. ఆ పథకాలు ఇంకా 'టేబుల్‌పైనే' వున్నాయి.

ఇజ్రాయిల్ పాలకులతో సంబంధాలను అరబ్ ప్రభుత్వాలు ఈవిధంగా సాధారణీకరిస్తూ, ఒక పెద్ద మోసపూరిత ఆటను ఆడుతున్నాయి. అందుకే, యుఏఇ – ఇజ్రాయిల్‌ల ఒప్పందాన్ని పాలస్తీనా నాయకత్వం ఒక 'విద్రోహం'గా పేర్కొనటం చాలా సమంజసమైనది. అరబ్ శాంతి చొరవను, అరబ్, ఇస్లామిక్ సదస్సుల నిర్ణయాలను, అంతర్జాతీయ చట్టబద్ధతను బ్రద్దలుకొట్టేదిగా; పాలస్తీనా ప్రజలపై దురాక్రమణగా; పాలస్తీనా హక్కులను, పవిత్ర విషయాలను ప్రత్యేకించి జెరూసలేమ్‌ను నిర్లక్ష్యం చేసేదిగా, 1967 జూన్ 4 నాటి స్వతంత్ర పాలస్తీనా రాజ్యాన్ని నిర్లక్ష్యం చేసేదిగా – ఈ ఒప్పందాన్ని పాలస్తీనా నాయకత్వం వ్యాఖ్యానించింది.

'పాలస్తీనా ప్రజలకు శాంతి, గౌరవం, ఆర్థిక అవకాశాలను మెరుగుపరిచే ఆకాంక్షే మీకుంటే, మా భూమిని, వనరులను దొంగిలించి, క్రూరమైన దురాక్రమణకు పాల్పడిన ఇజ్రాయిల్ చర్యలకు ముగింపు ఏమిటి' అని పాలస్తీనా లిబరేషన్ సంస్థ యుఏఇ, బహ్రెయిన్‌లను ప్రశ్నించింది. 'బలవంతం చేసి, బెదిరింపులు చేపట్టి ఇజ్రాయిల్‌తో అరబ్బులను సాధారణ స్థితిలో వుండాలనటం మీకు శాంతిని, గౌరవాన్ని తీసుకురాలేదు' అని కూడా ప్రకటించింది.

పాలస్తీనా ప్రజల పోరాటం దీర్ఘకాలికమైనది; వేదనాభరితమైనది. ఒకవైపున పాలస్తీనా ప్రజానీకం విస్తరణవాదులు, క్రూరులైన యూదు దురహంకార ఇజ్రాయిల్‌ను ఎదుర్కొంటున్నారు. ఇజ్రాయిల్‌కు అమెరికా సామ్రాజ్యవాదులు మద్దతుగా నిలవటమేగాక ఆయుధ సరఫరా చేస్తున్నారు. పాలస్తీనా టెర్రరిస్టులను పట్టుకోవటానికి ప్రతి యుద్ధానికీ చివరలో కానీ లేదా సైనిక చర్య తర్వాత కానీ ఇజ్రాయిల్ పాలకులకు అమెరికా సామ్రాజ్యవాదులు రక్షణ కవచాలను అందిస్తున్నారు. శాంతియుత కాలాన్ని, శాంతి చర్చలను కూడా తాము ఆక్రమించిన ప్రాంతాలపై తమ అదుపును సంఘటితం చేసుకొని చట్టబద్ధం చేసుకోవడానికి, సావకాశాన్ని పొందడానికి, పాలస్తీనా ప్రజలపై మరిన్ని క్రూరమైన సైనిక చర్యలకు సంసిద్ధమవటానికి ఉపయోగిస్తున్నారు. ఇజ్రాయిల్ పాలకులు శాంతి ఒప్పందాల పట్ల లేదా అంతర్జాతీయ తీర్మానాల పట్ల గౌరవ మర్యాదలను ఏనాడూ పాటించలేదు. తూర్పు జెరూసలేంలో తమ స్వీయ రాజధానితో, స్పష్టంగా నిర్వచించిన 1967 నాటి సరిహద్దులతో కూడిన ఒక స్వతంత్ర పాలస్తీనా రాజ్యాన్ని పాలస్తీనా ప్రజల హక్కుగా గుర్తించే ప్రాతిపదికన ఇజ్రాయిల్‌తో కలిసి మనుగడ సాగించేందుకు పాలస్తీనా నాయకత్వం సన్నద్ధమవుతున్న సమయాన, ఈ

రకపు పరిష్కార మార్గానికి విస్తృత అంతర్జాతీయ ఆమోదం లభిస్తున్న సమయాన – దీనినంతటినీ నిష్ఫలం చేయటానికి అమెరికా సామ్రాజ్యవాదులు చేయవలసినదంతా చేస్తున్నారు. ఇజ్రాయిల్ పాలకులు కోరుకున్న విధంగా పరిష్కారాలుగా వారు చెప్పినవాటిని నిరంకుశంగా రుద్దుతున్నారు. మరోవైపున అత్యధిక అరబ్ దేశాల పాలకులు ఒకరి తర్వాత మరొకరు అమెరికా సామ్రాజ్యవాదుల వత్తిడులకు, బెదిరింపులకు, వారు చూపించే ఆశలకు లోబడుతున్నారు. ఈవిధంగా పాలస్తీనా ప్రజలను ఒంటరిగా వదలివేస్తున్నారు లేదా మోసగిస్తున్నారు. అరబ్ ప్రపంచంలో సుదీర్ఘకాలపు ధృవీకరణ క్రమంలో ఇరాన్, టర్కీ, సిరియా వంటి దేశాలు అమెరికా, ఇజ్రాయిల్‌ల కుటిల పన్నాగాలను, యుఏఇ–ఇజ్రాయిల్‌ల ఒప్పందాన్ని వ్యతిరేకించటాన్ని కొనసాగిస్తూ పాలస్తీనా ప్రజల పక్షాన నిలుస్తున్నాయి.

ఈనాడు పాలస్తీనా ప్రజానీకం అత్యంత కష్టభరిత స్థితిలో వున్నారనేది నిజం. అయితే వారు ఒంటరిగా లేరు. కార్మికవర్గం, పీడిత జాతులు, ప్రజలతో సహా మధ్యప్రాచ్యం; ప్రపంచంలో సామ్రాజ్యవాదాన్ని, జాతుల అణచివేతను, విస్తరణవాద విధానాలను, దురాక్రమణలను, యూదు దురహంకారాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ – పాలస్తీనా ప్రజల న్యాయమైన సమస్య పక్షాన, వారి పోరాటం పక్షాన నిలుస్తున్నాయి. బాట సుదూరంగా, కష్టభరితంగా వున్నప్పటికీ, పాలస్తీనా ప్రజల విజయం తథ్యం.

★ ★ ★